క్లుప్తంగా

టీకాలతో సంపూర్ణ రక్షణ



తాడిమర్రిలో టీకాలు వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: వ్యాధి నిరోధక టీకాలతో చిన్నారులకు సంపూర్ణ రక్షణ లభిస్తుందని సీహెచ్ఓ హేమలత పేర్కొన్నారు. మండలంలోని తాడిమర్రి, పెద్దకోట్ల, చిల్లవారిపల్లి, దాడితోట, పిన్నదరి, కునుకంట్ల, ఎం.అగ్రహారం, నార్శింపల్లి తదితర గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సిబ్బంది బుధవారం నిర్వహించిన టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ, లక్ష్మీకాంతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పోషణ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

నల్లచెరువు: యర్రగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రఫీ మున్నీసా ఆధ్వర్యంలో బుధవారం పోషణ పక్వాడా ఘనంగా నిర్వహించారు. మహిళలు, గర్భిణులు, పిల్లలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పాలు, కోడిగుడ్లు, బాలామృతం, పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గాయత్రి, ధనమ్మ, షహీద, రోజా, కుళ్లాయమ్మ, లక్ష్మీదేవి, వేమనారాయణమ్మ, మహిళా పోలీస్ సాగైరాబాను, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పరీక్షలు

కదిరి అర్బన్: కదిరి అర్బన్, రూరల్ పరిధిలో బుధవారం పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. జెడ్పీ హైస్కూలులో జరుగుతున్న ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలను ఆర్జేడీ రాఘవరెడ్డి తనిఖీ చేశారు. మొత్తం 2,172 మందికి గాను 2114 మంది పరీక్షలు రాశారు. 58 మంది గైర్హాజరయ్యారు.

నియమావళి పాటించాలి

బత్తలపల్లి: రాజకీయ పార్టీలు, నాయకులు అందరూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఎంసీసీ అధికారులు తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం వారు బత్తలపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ నాయకులు సమావేశాలు, ర్యాలీలు, వాహనాలకు అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏ విషయాలలోనైనా తలదూర్చితే ఆర్‌పి యాక్టు 1951 ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రచారాలలో వ్యక్తిగత దూషణలు, కులాలు, మతాలకు సంబంధించి వాడరాదన్నారు. వాళ్లను ఆకట్టుకునే క్రమంలో ప్రలోభాలు జరిగితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ఆర్‌ఓ అనుమతితో కరపత్రాలు, పోస్టర్లు, జెండాలు ముద్రించాలన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ఎన్‌పీకుంట: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఆదినారాయణ హెచ్చరించారు. బుధవారం ఆయన ఎన్నికల నియమావళిపై మండలంలోని పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలలో ఫొటోలు తొలగించామని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశామని ఎంపీడీఓ తెలిపారు. ఇంకా ఎక్కడైన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు కానీ, పోస్టర్లు కానీ, గోడరాతలు ఉంటే తక్షణమే వాటిని తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కోడ్ ముగిసేంత వరకు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బొలెరో



నేలపై పడిన విద్యుత్ స్తంభం

ముదిగుబ్బ: నక్కలపల్లిలోని ప్రధాన వీధిలో విద్యుత్ స్తంభాన్ని బుధవారం బొలెరో వాహనం ఢీకొంది. వాహనం వెళ్లిన కాసేపటికే స్తంభం ఒరిగి కిందపడింది. అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుల పాత్ర కీలకం

- 250 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన భవన నిర్మాణ కార్మికులు

ధర్మవరం: సమాజాభివృద్ధిలో భవన నిర్మాణ కార్మికుల పాత్ర ఎంతో కీలకమైనదని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. బుధవారం ధర్మవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పార్టీల నుంచి 250 భవన నిర్మాణ కార్మిక కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారిలో ధర్మవరం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ముక్తం ఈశ్వరయ్యతో పాటు నాయకులు మాబువలి, ముక్తం మణిదీప్, నారాయణస్వామి, గోవిందు, వెంకటరాముడు తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అసంఘటిత రంగంలో స్వయం శక్తితో ఎదుగుతున్న భవన నిర్మాణ కార్మికులు ఆదర్శప్రాయులన్నారు. వారికి 2003లో తన తండ్రి అప్పటి ఎమ్మెల్యే దివంగత కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ భూములను నామమాత్రపు ధరతో ఇంటిస్థలాల కోసం 28ఎకరాలను పట్టణ సమీపంలో వేలం పాట ద్వారా కొనేవిధంగా చర్యలు చేపట్టారన్నారు. ఆ తర్వాత కొంతమంది వేలం పాటకు అడ్డు తగిలి పెండింగ్ పెట్టించారన్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు సుదీర్ఘ న్యాయ పోరాటం జరిపారన్నారు. వారి పోరాటం ఫలించి భవన నిర్మాణ సంఘం వారికి వేలం పాటలో కొన్న భూములు వారికే దక్కేలాగా 2015లో కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. అయితే తాను సైతం కార్మిక సంఘానికి అండగా నిలిచి ఎన్నోసార్లు ఎండోమెంట్ కమిషనర్, ముఖ్యమంత్రి కార్యాలయం వరకు సమస్యను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేశామన్నారు. అప్పట్లో ఈ స్థలం విలువ నామమాత్రంగా ఉన్నా.. ప్రస్తుతం ఎకరా రూ.3.50 కోట్లు రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ఉందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించేందుకు స్టాంప్ డ్యూటీ 28ఎకరాలకు గానూ రూ.7.50కోట్లు చెల్లించాల్సి ఉండగా అంత డబ్బు కార్మికులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో కలెక్టర్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ దృష్టికి తీసుకువెళ్లి ఉన్నతాధికారులతో ఒక కమిటి వేయించి స్టాంప్ డ్యూటీ తగ్గించేలా ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు గుర్తు చేశారు. దీంతో ప్రభుత్వ అనుమతితో స్టాంప్ డ్యూటీని రూ.7.50కోట్లు నుండి రూ.25 లక్షలు చెల్లించే విధంగా ప్రభుత్వం గతంలో జారీ చేయడంతో కార్మికుల సొంతింటి కల సాకారం చేశామన్నారు. తమకు ఇంతలా మేలు చేసినందునే వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నామని భవన నిర్మాణ కార్మికులు తెలిపారు. ఎన్నికల్లో కేతిరెడ్డిని ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బాలిరెడ్డి, కౌన్సిలర్లు మాసపల్లి సాయికుమార్, గజ్జల శివ, పెణుజూరు నాగరాజు, సీనియర్ నాయకులు యంబా లింగన్న, చిల్లా భాస్కర్‌రెడ్డి, బడన్నపల్లి కేశవరెడ్డి, ఎస్సీ బాషా, కాశీ, చింతకాయల నరేష్, అమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్దులచెర్వులో ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రచారం

తాడిమర్రి: మండలంలోని మద్దులచెర్వు గ్రామంలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తారని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి తెలిపారు. సింగిల్‌విండో అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సచివాలయ మండల కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉద్యాన ఉత్పత్తులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: బోరు బావుల కింద రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ తెలిపారు. ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా బుధవారం జీవీపాళ్యం గ్రామంలో ఉద్యాన ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించారు.

నేడు మక్బూల్ ఎన్నికల ప్రచారం

తలుపుల: మండలంలోని గంజివారిపల్లి, బోయపల్లి, కొత్తపల్లి, కొత్తపల్లి హరిజనవాడ, గుర్రంగుండ్లపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ గురువారం సాయంత్రం ఏడు గంటలకు ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని జెడ్పీటీసీ గిరిధర్‌రెడ్డి, కన్వీనర్ పయాజ్ అహమ్మద్, సీనియర్ నాయకులు వివేకానందరెడ్డి కోరారు.

మళ్లీ సంక్షేమ రాజ్యమే

- వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం
- చంద్రబాబు హామీలు నమ్మొద్దు
- ఇంటింటా ప్రచారంలో ఎమ్మెల్యే దుద్దుకుంట



కొత్తచెరువులో ఇంటింటి ప్రచారంలో దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: సంక్షేమ రాజ్యం కోసం మరోమారు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుందామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీ, కుమ్మరకాలనీల్లో బుధవారం ఆయన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలిగిన మేలును వివరించారు. ప్రతిపక్షనేత చంద్రబాబు ఎన్నికల వేళ ఇచ్చే మోసపూరిత హామీలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దన్నారు. 2014లో 600 హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు వాటి గురించి పట్టించుకోలేదన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేసిన ఏకైక సీఎంగా రికార్డు సాధించారన్నారు. చంద్రబాబు అందితే జుట్టు.. అందకుంటే కాళ్లు అన్నట్టుగా పొత్తుల కోసం అన్ని పార్టీలతోనూ వెంపర్లాడుతుంటే.. వైఎస్సార్‌సీపీ మాత్రం ప్రజలతోనే పొత్తు పెట్టుకుందని అన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వయసుపైబడినా గిమ్మిక్కు రాజకీయలు మానుకోలేదని, టీడీపీ వారికే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తూ పత్రికల్లో రాయించుకుంటూ ఆనంద పడుతున్నారని విమర్శించారు.

కొత్తచెరువులో 920 ఇంటి పట్టాలు

టీడీపీ హయాంలో కొత్తచెరువులో 400 మందికి పట్టాలు ఇచ్చారని, వాటికి ఆ పార్టీ నాయకులు రూ.లక్ష నుంచి రూ.3లక్షల దాకా వసూలు చేశారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్క రూపాయి తీసుకోకుండా 920 మంది పేదలకు ఇంటి పట్టాలు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు గాయత్రి, రమణారెడ్డి, జిల్లా అగ్రి బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవిశంకర్, మాజీ జెడ్పీటీసీ మహాలక్ష్మ్మి, మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు అంగడి సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రాధానాగరాజు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడెప్పరెడ్డి, కొడపగానిపల్లి రఘునాథరెడ్డి, నాయకులు తలమర్ల శ్యాంసుందర్‌రెడ్డి, పాదయాత్ర శంకర్, అంగడి సత్తి, షాన్‌సేట్, వెంకటరాముడు, ఎల్లప్ప, యోగానందరెడ్డి, తిప్పారెడ్డి, జనార్దనరెడ్డి, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దుద్దుకుంట ఎన్నికల ప్రచారం

మండల కేంద్రంలోని పెద్దమ్మగుడి ఇసువంకవీధి, కొండకింద కాలనీల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గురువారం ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలు

- ర్యాలీలకు అనుమతి తప్పనిసరి
- కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయండి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి సన్నీవంశీకృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సన్నీ వంశీకృష్ణ

కదిరి: నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు కదిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సన్నీ వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో కదిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లతో కలిసి ఆయన కోడ్ ఉల్లంఘన అంశంపై మీడియాతో మాట్లాడారు. ఇంటి యజమాని అనుమతి లేకుండా రాజకీయ పార్టీల పోస్టర్లు అతికించినా జెండాలు, ఎగురవేసినా అది కోడ్ ఉల్లంఘనే అవుతుందన్నారు. ఇంటి యజమాని కూడా తన ఇంటిపై మూడు జెండాలకు మించి ఎగురవేస్తే అది కూడా కోడ్ ఉల్లంఘనే అవుతుందన్నారు. ఆయా రాజకీయ పార్టీలు ర్యాలీలు చేయాలంటే కచ్చితంగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతి తీసుకున్న మార్గంలోనే ర్యాలీ వెళ్లాలని, అలాగే గడువులోపు ముగియకపోతే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లేనని స్పష్టం చేశారు. బైక్ ర్యాలీల్లో ఒకబైక్‌పై ఒక జెండా మాత్రమే ఉండాలన్నారు. ర్యాలీ కారణంగా ఎక్కడైనా ట్రాఫిక్ స్తంభిస్తే సదరు పార్టీ అభ్యర్థిపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదవుతుందని చెప్పారు. అనుమతి లేకుండా వీధులు.. ఇంకెక్కడైనా లౌడ్‌స్పీకర్లు పెడితే కోడ్ ఉల్లంఘనగానే భావిస్తామని తెలియజేశారు. పత్రికల్లో, టీవీల్లో పెయిడ్ ఆర్టికల్స్ ప్రచురించినా, ప్రసారం చేసినా వాటిని ఆ పార్టీ అభ్యర్థి ఖర్చు కింద జమ కడతామని తెలిపారు. కదిరి ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. కోడ్ ఉల్లంఘనపై సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదునూ గంటలోగా పరిష్కరిస్తామని చెప్పారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నాయకుల ఫోటోలు తొలగించామని, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశామని తెలిపారు. కోడ్ ఉల్లంఘనపై ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలే కాకుండా ప్రజలు కూడా సీ-విజిల్ యాప్ ద్వారా కానీ లేదా 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు కానీ ఫిర్యాదు చేయవచ్చని, లేదంటే నేరుగా ఆర్డీఓ కార్యాలయంలోనైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సీ-విజిల్ ద్వారా ఇప్పటికే తమకు 12 ఫిర్యాదులు వస్తే వాటన్నింటిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు.

టీడీపీకి పలువురు గుడ్‌బై

- జగన్ పాలన నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు : జగన్ సంక్షేమ పాలన నచ్చి పలువురు టీడీపీకి గుడ్‌బై చెప్పి.. వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఓడీచెరువు నుంచి ఎం.గౌస్‌మోదీన్‌ఖాన్, జి.ఫయాజ్, కె.మహబూబ్ బాషా, ఎస్.గఫూర్, సి.మాబుసాహెబ్, టి.బాబాజాన్, ఎం.జిలాన్‌ఖాన్, ఎస్.ఇర్షాద్, ఎస్.ఇర్ఫాన్, కె.ఖాదర్ వలి, ఎస్.షబ్బీర్, కె.తబ్రేజ్, ఎం.అల్లాబకాష్, వెల్డింగ్ బాబా, సి.బాబావలి, బి.ఫక్రుద్దీన్, నషిమాన్ సహా దాదాపు 40 కుటుంబాలు, డబురువారిపల్లి పంచాయతీ దిగువపల్లి నుంచి ఎన్.శ్రీరాములు, చిన్న వెంకట రాముడు, లక్ష్మీనరసు, చంద్రమోహన్, లక్ష్మన్న, శ్రీనివాసులు, ఆర్.వెంకటరమణ, మల్లికార్జున, అంజి, శేఖర్ సహా 20 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. అనంతరం ఓడీచెరువులోని జౌళిబాబా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, ఎంపీపీ పర్వీన్‌బాను, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్దన్‌రెడ్డి, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి, మైనార్టీ కన్వీనర్ బాబ్, సర్పంచులు గోవిందు, జగన్‌మోహన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసే సీఎం జగన్‌కు మద్దతివ్వండి



ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

బత్తలపల్లి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతివ్వాలని, లాస్ట్ చాన్స్ అంటూ మభ్య పెట్టే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకి మరోసారి బుద్ధి చెప్పాలని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బత్తలపల్లిలోని బళ్లారి దుర్గమ్మ గుడి, కరెంట్ ఆఫీస్ వెనుక, వినాయక నగర్, బీసీ కాలనీల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ, ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్ కుమార్, ఉప సర్పంచు కోటి గోపీనాథ్, యువజన నాయకులు కోటి సురేష్, కో ఆప్షన్ మెంబర్ కరీం సాబ్, నాయకులు కోటి వీరనారప్ప, కోటి తిరుపాలు, మండల నారాయణ, సాకే గోపాల్, యోగానందాచారి, వక్కల శంకరయ్య, నడిమింటి షేక్షావలి, టైలర్ బాబా, బాబ్‌జాన్, వడ్డే ప్రసాద్, జిక్రియా, సంద్రా రామకృష్ణ, కుమ్మర వెంకటరమణ, ఎస్సీ సెల్ నాయకులు మునలప్ప, కొంకా ప్రసాద్, గవ్వల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తనకల్లు: సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందామని నాయకులు అన్నారు. తనకల్లులోని పీవీకే ఫంక్షన్‌హాల్‌లో బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామన్నారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబమూ లబ్ధి పొందిందన్నారు. కార్యకర్తలు ఇంటింటా తిరిగి జరిగిన మేలును వివరించి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయించాలన్నారు. ఈ నెల 23న రాచినేపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్ ఎన్నికల ప్రచార రథం ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, అగ్రి బోర్డు చైర్మన్ కొండా మల్లికార్జున, ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు నాయుడు, సంజీవరెడ్డి దేశాయి, గణేష్‌రెడ్డి, సానే జనార్దన్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, నీలకంఠారెడ్డి, అశోక్‌రెడ్డి, బాబా, బీఎస్ నిజాం, చిదానందరెడ్డి, సిద్దారెడ్డి, శ్రీకంఠారెడ్డి, రహంతుల్లా, చాంద్‌బాషా, దొరస్వామి, శంకర్, రెడ్డిపీరా, శ్రీనివాసులు, పూలశీనా, శ్రీరాములు, ఇటుక వెంకటరమణ, అబ్దుల్, రామమోహన్‌రెడ్డి, సుధాకర్, గోపాల్, సునీల్, మోహన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, అయూబ్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలోని ఖైరుల్‌మస్తాన్ మసీదులో బుధవారం ఇఫ్తార్ విందుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ హాజరయ్యారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

ఓడీచెరువు : మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మూడోరోజు బుధవారం ఇంగ్లిష్ పరీక్ష జరిగింది. మొత్తం నాలుగు కేంద్రాల్లో 17 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు.. బుధవారం మామిళ్లపల్లి సమీపంలోని వ్యవసాయ పొలాల్లోని పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17,100 స్వాధీనం చేసుకున్నారు. పేకాట, మట్కా, అక్రమ మద్యం విక్రయాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నల్లమాడ: సి.రెడ్డివారిపల్లి వార్డు మెంబర్ కిష్టమ్మ భర్త పి.వెంకటేష్(70), చెరువువాండ్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఎం.రామకృష్ణ భార్య ఆదిలక్ష్మి(45) అనారోగ్య కారణాలతో మంగళవారం మృతిచెందారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి బుధవారం ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. కిషన్‌రెడ్డి వెంట చారుపల్లి సర్పంచ్ ప్రమీలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణ, నాయకులు అశ్వర్థనారాయణ, మధుసూదన్‌రెడ్డి, బయపరెడ్డి, అరుణ్‌కుమార్, శంకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

ధర్మవరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: తనను మరోసారి గెలిపిస్తే రాష్ట్రంలోనే ధర్మవరాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం నల్లచెర్లోపల్లిలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టిన ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. బాణా సంచా కాల్చుతూ పూల బాటపై నడిపించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంటేనే సంక్షేమ పాలన కొనసాగుతుందన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని కేతిరెడ్డి వివరించారు.

చంద్రబాబు అబద్ధాలకోరు

తెలుగుదేశం అధినేత చంద్రబాబు అబద్ధాలకోరు అని కేతిరెడ్డి విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జైలుకెళ్లిన ఆయన అనారోగ్యం అంటూ నాటకాలాడి బెయిలు పొందారన్నారు. ఎన్నికల వేళ హామీలు ఇవ్వడం.. ఓటు వేయించుకున్నాక వాటిని విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. ప్రజలు చైతన్యవంతులయ్యారని, బాబు చెప్పే అబద్ధాలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న వరదాపురం సూరి నీరు-చెట్టు పనుల్లో రూ.కోట్లు కొల్లగొట్టారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి నారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్, చంద్రాయుడు, రామాంజినేయులు, సురేంద్ర, శంకర్, శ్రీనివాసులు, గంగులప్ప, నాగన్న, చెన్నప్ప, నాగభూషణ, ఆంజనేయులు, శివయ్య, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో పిల్లలు, ఉద్యోగులు పాల్గొనరాదు



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి: రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో చిన్న పిల్లలు, ప్రభుత ఉద్యోగులు పాల్గొనరాదని ఆర్డీఓ భాగ్యరేఖ హెచ్చరించారు. ఆమె డీఎస్పీ వాసుదేవన్, సిబ్బందితో కలిసి పుట్టపర్తిలో బుధవారం ఎన్నికల నియమావళిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. కోడ్ ఆఫ్ కాండక్టును పటిష్టంగా అమలు చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు వాహనాల అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో పార్టీ జెండాలు ఉండకూడదని, ప్రచారంలో చిన్న పిల్లలు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకూడదని, ప్రార్థన స్థలాలు, దేవాలయాలు, మసీదులు, చర్చిల దగ్గర ప్రచారాలు చేయకుడదని తెలిపారు. సమావేశాలకు ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరని ఆమె వివరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220727, 9912220726, 9010593486